భూగర్భ జలాల పరిరక్షణకు చర్యలేవి?

- పార్కుల దగ్గర కనిపించని ఇంకుడు గుంతలు
- రోడ్లపై చేరిన వరదనీరు
- పట్టించుకోని సంబంధిత అధికారులు

బండ్లగూడ: భూగర్భ జలాలు రోజురోజుకు అడుగంటుతున్నాయి. అలాంటి నీటిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రజలందరిపై ఉంది. గతంలో భూగర్భ జలాలు అతి తక్కువ లోతులోనే లభ్యమయ్యేవి. ప్రస్తుతం అత్యధికంగా భూగర్భ జలాలను వాడుకోవడం వలన ఇప్పటికే గ్రౌండ్ వాటర్ అడుగంటిపోతున్నాయి. ఈ భూగర్భ జలాలు ప్రమాద స్థాయికి చేరకముందే భూగర్భ జలాల స్థాయిని పెంచాల్సిన అవసరం ఉందని నిపుణులు సూచిస్తున్నారు.

ఇంకుడు గుంతల నిర్మాణాల్లో నిర్లక్ష్యం..

కార్పొరేషన్ పరిధి భూగర్భ జలాలు అడుగంటి పలు కాలనీల్లో ఇంకుడు గుంతలు, వాననీటి సంరక్షణ చర్యలు చేపట్టాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ప్రతి ఏటా ఏప్రిల్, మే, జూన్ నెలల్లో ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో పార్కులు, ప్రభుత్వ స్థలాల్లో ఇంకుడు గుంతల నిర్మాణ పనులు చేపట్టాలి. కానీ ఇక్కడ పట్టించుకునేవారే కరవయ్యారు. కార్పొరేషన్ పరిధిలో అప్పట్లో 200 అడుగు లోతుల్లోనే పుష్కలంగా నీరు ఉండేది. ప్రస్తుతం 1000 అడుగుల లోతున తవ్వితే కానీ బోర్లలో నీటి చుక్క జాడ కనిపించట్లేదు. ప్రతి ఇంట్లో నిత్యావసరాలకు ఉపయోగించే నీటికంటే వృథాగా పోయే నీరే ఎక్కువ.

వృథాగా పోయే నీటిని ఒక చోటికి చేర్చితే భవిష్యత్‌తరాలకు నీటి సమస్య తలెత్తకుండా ఉంటుందని పలువురు మేధావులు చెబుతున్నారు. వ్యక్తి గతంగానే కాకుండా ప్రతి ఒక్కరూ సామాజికపరంగా ప్రజల్లో అవగాహన చేపట్టి భారీఎత్తున ఇంకుడు గుంతల నిర్మాణం చేపట్టగలిగే ప్రయత్నం చేస్తే సరైనా ప్రతిఫలం పొందగల్గుతామని పలువురు అభిప్రాయపడుతున్నారు.

నిబంధన ఉన్నా..

ఇంటి నిర్మాణ అనుమతులు ఇచ్చే ముందు ఇంకుడుగుంత నిర్మించాలనే నిబంధన ఉన్నప్పటికీ పట్టించుకోవడం లేదనే విమర్శలున్నాయి. టౌన్‌ప్లానింగ్, ఇంజినీరింగ్ విభాగం అధికారులు చూసీచూడనట్లుగా ఉండటంతోనే నిర్మాణదారులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని సమాచారం. వర్షపునీరు వచ్చే దిగువ ప్రాంతాల్లో ఉన్న ప్రభుత్వ స్థలాలు, పార్కు స్థలాల్లో ఇంకుడు గుంత నిర్మాణం చేపట్టేలా మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు తగిన చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.


బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం


పీఎండీటీ కాలనీలో నిర్మించిన ఇంకుడు గుంతలో వ్యర్థాలు

పెరుగుతున్న నిర్మాణాలు..

నగరానికి అత్యంత చేరువలో ఉండటంతో బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో నిర్మాణాలు పెద్దఎత్తున జరుగుతున్నాయి. ప్రధానంగా ఈ ప్రాంతంలో గేటెడ్ కమ్యూనిటీ అపార్ట్‌మెంట్లు, విల్లాల నిర్మాణాలు చేపడుతున్నారు. కొంతమంది బిల్డర్లు మాత్రం ప్రభుత్వ నిబంధనలు పాటించడం లేదు. నిర్మాణ సమయంలోనే ఇంకుడుగుంత నిర్మించాలనే నిబంధనను ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. కనీసం ఇంకుడుగుంతల నిర్మాణాలు నిర్మించాలనే నిబంధనను సరిగ్గా అమలు చేయకపోతుండటం అందరినీ విస్మయానికి గురిచేస్తుంది.

కేవలం నాలుగు ఇంకుడు గుంతలు..

ప్రస్తుతం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 200లకు పైగా కాలనీలు, 1.50 లక్షల జనాభా ఉన్నట్టు అంచనా. ఆయా కాలనీల్లో నిర్మాణాల జాతర పెద్దఎత్తున సాగుతున్నాయి. అధికారులు ఎందుకు పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారన్నది ప్రశ్నగా మారింది. కార్పొరేషన్ పరిధిలో ఇప్పటి వరకు అధికారులు ప్రభుత్వ స్థలంలో నాలుగే ఇంకుడు గుంతలు నిర్మించడం అలోచించాల్సిన విషయం.

నిబంధనలు పాటించేలా చూస్తాం



నూతన నిర్మాణాలు చేపట్టే చోట ఇంకుడు గుంత తప్పకుండా నిర్మించాలి. లేదంటే తగిన చర్యలు చేపడతాం. నిర్మాణదారులకు ఇంకుడు గుంతలపై టౌన్‌ప్లానింగ్ టీపీఎస్ విజయలక్ష్మి అవగాహన కల్పిస్తున్నారు. ప్రస్తుత్తం 6 ఇంకుడు గుంతలకు ప్రపోజల్ పెట్టాం. మరిన్ని ఇంకుడు గుంతల నిర్మాణం చేపట్టేందుకు కృషి చేస్తాం. – శరత్‌చంద్ర, కమిషనర్ బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్

తిరుమలలో చిన్నారుల నాట్య ప్రదర్శన



మణికొండ: నార్సింగి మున్సిపాలిటీకి చెందిన పలువురు చిన్నారులు తిరుమలలో జరుగుతున్న ఉత్సవాల్లో నాట్యం చేసే అవకాశం లభించింది. సోమవారం ఉదయం దేవాలయం మాడవీధుల్లో సామూహికంగా జరిగిన భరతనాట్యం కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. తమకు కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వర స్వామి ముందు నాట్యం చేసే అవకాశం రావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. కె. మమత, కె. ప్రవస్థి, ఎ.హమ్షిక, ఎ.వీణ, ఎం. హరినీరెడ్డి, ఎం. సిద్దీక్షరెడ్డి నాట్య ప్రదర్శన చేశారు.

యజమానులకు సెల్‌ఫోన్లు అప్పగింత



శంషాబాద్ : వివిధ ప్రాంతాల్లో పోగొట్టుకున్న, చోరీకి గురైన మొబైల్ ఫోన్లను శంషాబాద్ డీసీపీ నారాయణరెడ్డి ఆధ్వర్యంలో యజమానులకు పోలీసులు అప్పగించారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ.. సీఐఆర్ పోర్టల్ ద్వారా పొగొట్టుకున్న, చోరీ జరిగిన మొబైల్ ఫోన్లు తిరిగి వాడితే వాటిని గుర్తించడం తేలికగా మారిందన్నారు. ఆర్‌జీఐఏ, శంషాబాద్ పోలీస్‌స్టేషన్ల పరిధిలోని మొత్తం 30 స్మార్ట్‌ఫోన్లను బాధితులకు అందజేసినట్లు ఆయన తెలిపారు. మొబైల్‌ఫోన్లు పోగొట్టుకున్న వారు వెంటనే సంబంధిత పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు.

ఉర్దూ భాషాభివృద్ధికి కృషి


కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని సత్కరిస్తున్న అబ్దుల్‌సత్తార్, మీర్‌ఫిరాసత్ అలీ బాక్రీ

చార్మినార్: దేశంలో ఉర్దూ భాషాభివృద్ధికి ప్రధాని నరేంద్ర మోదీ కృషి చేస్తున్నారని నేషనల్ కౌన్సిల్ ఫర్ ప్రమోషన్ ఆఫ్ ఉర్దూ ల్యాంగ్వేజ్ (ఎన్‌సీపీయూఎల్) నామినేటెడ్ సభ్యుడు, సీనియర్ జర్నలిస్ట్ మహ్మద్ అబ్దుల్ సత్తార్ అన్నారు. పాతబస్తీ దారుషిఫాకు చెందిన బీజేపీ మాజీ అధికార ప్రతినిధి మీర్ ఫిరాసత్ అలీ బాక్రీతో కలిసి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో బీజేపీ అత్యధిక పార్లమెంట్ స్థానాలు గెలిచి మళ్లీ ప్రధానిగా నరేంద్ర మోదీ పీఠం అధిరోహిస్తారని ధీమా వ్యక్తం చేశారు.

వారే వసూలు రాయుళ్లు!

బీఆర్‌ఎస్ నాయకుల ప్రత్యారోపణ


మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

మణికొండ : నార్సింగి మున్సిపాలిటీ పరిధిలో చైర్‌పర్సన్, వైస్ చైర్మన్, మీడియా పేర్లతో ప్రతి బిల్డర్ వద్ద కోట్లు వసూలు చేసింది.. పార్టీ ఫిరాయించిన కౌన్సిలర్లేనని మాజీ వైస్ చైర్మన్ వెంకటేష్‌యాదవ్, బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు ఆర్. నర్సింహ, కో-ఆప్షన్ సభ్యుడు ప్రశాంత్‌యాదవ్‌లు ఆరోపించారు. 'ఇటీవల కాంగ్రెస్‌లో చేరిన కౌన్సిలర్లు అమ్ముడుపోయారని.. వైస్ చైర్మన్ చేసిన ఆరోపణలపై ఆదివారం వైస్ చైర్మన్ కబ్జా రాయుడని' వారు పేర్కొన్నారు. దీనిపై స్పందించిన బీఆర్‌ఎస్ నాయకులు సోమవారం నార్సింగిలో సమావేశం ఏర్పాటు చేసి కోకాపేటలో 220 గజాల గ్రామకంఠం భూమిని కబ్జా చేసి రూ.2.50 కోట్లకు కౌన్సిలర్లు అమ్ముకున్నారన్నారు. 250 గజాల లేఅవుట్‌లో లక్షలాది రూపాయలు అందరి పేర్లు చెప్పి వసూలు చేసి దండుకుంటున్నారన్నారు. బీసీ శ్మశానవాటిక స్థలంలో 4 ఇంటి పట్టాలను సృష్టించి కబ్జాచేసి అమ్ముకున్న చరిత్ర వారిదన్నారు.

డబ్బులు డిమాండ్..

అవిశ్వాసం పెడితే కాంగ్రెస్ వారు రూ.15లక్షలు ఇస్తామంటున్నారని, పెట్టవద్దంటే మీరు ఎంత ఇస్తారని తనతోనే పత్తి ప్రవీణ్‌కుమార్ బేరం మాట్లాడారని, కాంగ్రెస్ వారు రూ.25 లక్షలు ఇవ్వడంతోనే ఆ పార్టీలో చేరి అవిశ్వాసం పెట్టారని మాజీ వైస్ చైర్మన్ అన్నారు.

బుల్కాపూర్ నాలా కబ్జా..

బుల్కాపూర్ నాలా కబ్జాచేసి తన అపార్ట్‌మెంట్‌కు రూ.70 లక్షలు మున్సిపల్ నిధులతో రోడ్డు వేసుకున్న చరిత్ర శివారెడ్డిదన్నారు. ఆరు గ్యారంటీలకు ప్రజలు ఎప్పుడో దరఖాస్తులు చేసుకున్నారని.. అలాంటి వారికి పథకాలను ఇప్పిస్తామని పార్టీ మారామనటం హాస్యాస్పదమన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్‌గా ఉన్న దళిత మహిళను తమ వార్డులలో తిరగనివ్వని చరిత్ర వారిదన్నారు. పార్టీకి రాజీనామా చేయకుండా అవిశ్వాసంపై ముందుగా సంతకాలు చేసి తర్వాత పార్టీలో చేరడంతోనే వారి బేరసారాలు అర్థం చేసుకోవచ్చన్నారు. వారి కబ్జాలు, అక్రమాలపై తహసీల్దార్, మున్సిపల్ కమిషనర్లకు త్వరలో ఫిర్యాదులు చేస్తామన్నారు. కో- ఆప్షన్ సభ్యుడు మహ్మద్, నాయకులు హరిశంకర్ తదితరులు పాల్గొన్నారు.


నూతన కార్యవర్గ సభ్యులను సన్మానిస్తున్న డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్‌రెడ్డి

నూతన కమిటీకి సన్మానం

బండ్లగూడ: నూతన కార్యవర్గ సభ్యులను ఎన్నుకుని తమ సమస్యల పరిష్కారానికి అందరూ కలిసికట్టుగా పనిచేయాల్సిన అవశ్యకత ఉందని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్‌రెడ్డి అన్నారు. బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని హైదర్షాకోట్ శాంతినగర్ కాలనీ అసోసియేషన్ నూతన ఎన్నిక నిర్వహించారు. ఈ ఎన్నికల్లో అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా ఎం.వెంకట్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా సాయిరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా జగన్‌మోహన్, సంయుక్త కార్యదర్శులుగా చంద్రకుమార్, నరేందర్‌లు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అసోసియేషన్ సభ్యులు డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్‌రెడ్డి నూతన కమిటీ సభ్యులను ఆయన నివాసంలో సన్మానించారు.

చెత్త సేకరణలో జాప్యం వద్దు

వెస్ట్ జోనల్ కమిషనర్ స్నేహ శబరీష్



శానిటేషన్ విభాగం అధికారులతో సమావేశమైన జోనల్ కమిషనర్

గచ్చిబౌలి: అనుమతి లేకుండా విధులకు హాజరుకాని శానిటేషన్ సిబ్బందిపై చర్యలు తప్పవని వెస్ట్ జోనల్ కమిషనర్ స్నేహ శబరిష్ హెచ్చరించారు. సోమవారం శేరిలింగంపల్లి వెస్ట్ జోనల్ కార్యాలయంలో శానిటేషన్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జీవీపీ పాయింట్లలో జూన్ 2 నాటికి చెత్తను పూర్తిగా తొలగించాలని అధికారులను ఆదేశించారు. పారిశుద్ధ్యంపై ఆన్‌లైన్‌లో వచ్చిన ఫిర్యాదులను 24 గంటల్లో పరిష్కరించాలని సూచించారు. చెత్త సేకరణలో జాప్యం లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో వెస్ట్ జోనల్ డిప్యూటీ కమిషనర్ వేణు గోపాల్ రెడ్డి, నాలుగు సర్కిళ్ల ఏఎంఓహెచ్‌లు డాక్టర్ నగేష్, కార్తీక్, వెంకటేశ్వర్లు, విజయ్ కుమార్, శానిటేషన్ సూపర్‌వైజర్లు జలంధర్‌రెడ్డి, శ్రీనివాస్, విజయ్ కుమార్ పాల్గొన్నారు.

చెట్లు నరికివేత


కొండాపూర్‌లో ఫుట్‌పాత్‌పై ..

గచ్చిబౌలి: ఫుట్‌పాత్‌పై ఉన్న చెట్లను నరికివేశారు. కొద్ది రోజుల క్రితం కొండాపూర్‌లోని మై హోం మంగళ రోడ్డులో ఫుట్‌పాత్‌పై ఉన్న రెండు చెట్లను నరికివేయడంతో మొండాలు దర్శనమిస్తున్నాయి. ఓ వైపు పచ్చదనం పెంచేందుకు తెలంగాణ ప్రభుత్వం పెద్ద ఎత్తున మొక్కలు నాటుతోంది. జీహెచ్ఎంసీ పరిధిలో భవనాలకు అడ్డు వస్తున్నాయని కొందరు వ్యక్తులు యథేచ్ఛగా చెట్లను నరకడం రివాజుగా మారింది.

ఇగ్నోలో అడ్మిషన్లకు దరఖాస్తుల ఆహ్వానం

నాంపల్లి: ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఇగ్నో) 2024వ సంవత్సరం అడ్మిషన్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఇగ్నో హైదరాబాద్ ప్రాంతీయ కేంద్రం సంచాలకుడు డాక్టర్ బి.రాజగోపాల్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. సర్టిఫికెట్, డిప్లొమా, పీజీ సర్టిఫికెట్, పీజీ డిప్లొమా, డిగ్రీ, పీజీ (పోస్ట్‌గ్రాడ్యుయేషన్) కోర్సులు ఉన్నాయని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు బీఏ, బీకాం, బీఎస్సీలో చేరేందుకు పూర్తి ఫీజు రాయితీని కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. జూన్ 30వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో అడ్మిషన్లు పొందవచ్చని తెలిపారు. మరిన్ని వివరాలకు ఇగ్నో వెబ్‌సైట్ www.ifnou.ac.in లేదా 9492451812, 040-23117550 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

రాజేంద్రనగర్: విద్యుత్ మరమ్మతుల కారణంగా మంగళవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని చార్మినార్ సీబీడీ ఏడీఈ ఓ ప్రకటనలో తెలిపారు. ఏజీకాలనీ ఫీడర్ పరిధిలోని సంజీవని హిల్స్, నలందనగర్, సిరిమల్లెనగర్, ఏజీకాలనీ ప్రాంతాల్లో ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు, హైదర్‌గూడ ఫీడర్ పరిధిలోని నలందనగర్, లోటస్ స్కూల్, ప్లెసెంట్ పార్క్, న్యూ ఫ్రెండ్స్ కాలనీ ప్రాంతాల్లో మధ్యాహ్నం 12 గంటల నుంచి 2 గంటల వరకు, జనప్రియ ఓహెచ్ ఫీడర్ పరిధిలోని న్యూ ఫ్రెండ్స్ కాలనీ, జనప్రియ అపార్ట్‌మెంట్, లక్ష్మీనగర్, ప్లెసెంట్ పార్కు ప్రాంతాల్లో మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

బండ్లగూడ: కిస్మత్‌పూర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం విధిస్తున్నట్లు విద్యుత్ అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి ఒంటిగంట వరకు బాబమ్మ కాలనీ, మైత్రికాలనీ, శివసాయికాలనీ, వినాయకనగర్‌కాలనీ, ఎస్సీ బస్తీ, బృందావన్‌కాలనీ, శ్రీకృష్ణ కాలనీ, హనుమాన్‌నగర్ కాలనీ, బాలాజీనగర్ కాలనీ, కిస్మత్‌పూర్ తదితర ప్రాంతాల్లో మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు గమనించి సిబ్బందికి సహకరించాలని కోరారు.

రాజేంద్రనగర్ : ఉప్పర్‌పల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో వివిధ మరమ్మతుల కారణంగా మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని రాజేంద్రనగర్ విద్యుత్ సెక్షన్ అసిస్టెంట్ ఇంజినీర్ హాథిరాం తెలిపారు. జన చైతన్య విద్యుత్ ఫీడర్ పరిధిలో ఉదయం 10 గంటల నుంచి 11.30 గంటల వరకు, జన చైతన్య ఫేజ్, సాయిభవాని, ఉప్పర్‌పల్లి, సన్ రైస్ హోమ్స్ ప్రాంతాలు, నాయుడు కాలనీ విద్యుత్ ఫీడర్ పరిధిలోని ప్రాంతాల్లో 12 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 వరకు, నాయుడు కాలనీ, వాంబేకాలనీ, పోర్ట్ వ్యూ కాలనీ, న్యూ ఫ్రెండ్స్ కాలనీ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

కిస్మత్‌పూర్ విద్యుత్ ఫీడర్ పరిధిలో..

కిస్మత్‌పూర్ విద్యుత్ ఫీడర్ పరిధిలో మరమ్మతుల నిమిత్తం మంగళవారం ఉదయం 11 గంటల నుంచి ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని అసిస్టెంట్ ఇంజినీర్ శ్రీనివాస్ తెలిపారు. ఈ సబ్‌స్టేషన్ పరిధిలోని ప్రాంతాలైన మక్కా కాలనీ, మైత్రి కాలనీ, శివసాయి కాలనీ, వినాయకనగర్ కాలనీ, దళిత బస్తీ, బృందావన్ కాలనీ, శ్రీకృష్ణ కాలనీ, హనుమాన్‌నగర్ కాలనీ, బాలాజీనగర్ కాలనీ, కిస్మత్‌పూర్ గ్రామం ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు సిబ్బందికి సహకరించాలని కోరారు.

పత్తికుంటలో అభివృద్ధి పనులు చేపట్టాలి



రాజేంద్రనగర్: వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా రాజేంద్రనగర్‌లోని పత్తికుంటలో అభివృద్ధి పనులను చేపట్టాలని రాజేంద్రనగర్ గణేష్ ఉత్సవ సమితి ప్రధాన కార్యదర్శి వై.శ్రీధర్ అన్నారు. ఈ మేరకు సోమవారం చార్మినార్ జోన్ జోనల్ కమిషనర్ వెంకన్నను ఆయన కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వినాయక ఉత్సవాలను దృష్టిలో ఉంచుకుని వర్షాలు కురిసే ముందు పత్తికుంటలో పూడికతీత పనులను చేపట్టి వినాయక నిమజ్జనానికి భారీ విగ్రహాలు నిమజ్జనం చేసేలా అవకాశం కల్పించాలన్నారు. ప్రతిఏటా మన ప్రాంతంలో ఉన్న విగ్రహాలే కాకుండా దూర ప్రాంతాల నుంచి భారీ విగ్రహాలను ఇక్కడికి నిమజ్జనానికి తీసుకొస్తారన్నారు. వెంటనే పత్తికుంటను శుభ్రం చేయడానికి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. డి. యాదగిరి తదితరులున్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం


రాకేష్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పూర్వ విద్యార్థులు

రాజేంద్రనగర్: బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కాడెం సుధాకర్, సురేష్, మిత్రుల ఆధ్వర్యంలో రాజేంద్రనగర్, బుద్వేల్, కిస్మత్‌పూర్, అత్తాపూర్, హైదర్‌గూడ, ప్రేమావతిపేట్, బండ్లగూడ ప్రాంతాల్లో ఉండే ప్రభుత్వ ఉన్నత పాఠశాల రాజేంద్రనగర్ 1987-88 బ్యాచ్‌కు చెందిన 40 మంది పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం కిద్వే కాటేజ్ రాజేంద్రనగర్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా అకాల మృతి చెందిన దివంగత రాకేష్ (సింగర్)కు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. పాత మిత్రులందరూ జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. తుల్జాగారి శ్రీరాములు, ధన్‌రాజ్, రఘునాథ్‌రెడ్డి, శ్రీనివాస్, ప్రవీణ్‌కుమార్, మురళీ, గోవింద్‌రాజ్, రాజేందర్, సురేశ్, శంకర్, రాములు తదితరులు పాల్గొన్నారు.


ప్రత్యేక పూజల్లో పాల్గొన్న భక్తులు

నాగపడగ బహూకరణ

మణికొండ: సంకటహర హనుమాన్ దేవాలయం ఆవరణలో ఉన్న శివాలయానికి భక్తులు నాగపడగను బహూకరించారు. మైహోం అవతార్ నివాసి పూర్ణం లక్ష్మీశ్రీనివాస్ దంపతులు 800 గ్రాముల వెండి నాగపడగను తయారు చేయించారు. సోమవారం దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం స్వామివారికి అలంకరించారు. దాత కుటుంబసభ్యులతో పాటు భక్తులు, దేవాలయ అభివృద్ధి కమిటీ పాల్గొన్నారు.


వట్టినాగులపల్లిలో అక్రమ నిర్మాణాలను కూల్చివేయిస్తున్న దృశ్యం

అక్రమ నిర్మాణాల కూల్చివేత

మణికొండ: ఎన్నికల సమయంలో ప్రభుత్వ భూమిలో వెలసిన అక్రమ నిర్మాణాలను రెవెన్యూ అధికారులు కూల్చివేశారు. గండిపేట మండలం, వట్టినాగులపల్లి రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 128లో గదులను నిర్మించి అక్రమ నిర్మాణాలు చేపట్టారన్నారు. వాటిని పరిశీలించిన రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు విక్రమ్‌రెడ్డి, సురేష్‌లు తహసీల్దార్‌కు నివేదిక అందజేశారు. దీంతో ఆయన ఆదేశాల మేరకు సోమవారం అక్రమ నిర్మాణాలను కూల్చివేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ ఎస్. శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వ భూముల జోలికొస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. మరోసారి కబ్జాలకు పాల్పడితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. ఇప్పటికే మండల పరిధిలో పదుల సంఖ్యలో క్రిమినల్ కేసులు నమోదు చేశామన్నారు.

బఫర్‌జోన్‌లో ప్రహరీ కూల్చివేత..

రాజేంద్రనగర్: శివరాంపల్లి ఊర చెరువు ఎఫ్‌టీఎల్ బఫర్ జోన్‌ను ఆక్రమించి నిర్మించిన ప్రహరీని రాజేంద్రనగర్ సర్కిల్ టౌన్‌ప్లానింగ్, నీటి పారుదలశాఖ అధికారులు సోమవారం కూల్చివేశారు. శివరాంపల్లి జాగీర్ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 45లో ఎఫ్‌టీఎల్‌ను ఆక్రమించి నిర్మించిన ప్రహరీని ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు జేసీబీతో కూల్చివేయించారు. ఈ సందర్భంగా ఏసీపీ ఖాదర్ మాట్లాడుతూ.. అక్రమ నిర్మాణాలను ఉపేక్షించేది లేదని, ఇప్పటికే నిర్మించిన ఇళ్లకు కూడా నోటీసులు జారీ చేశామన్నారు. బఫర్ జోన్‌లో ఎలాంటి నిర్మాణాలు చేపట్టినా కఠిన చర్యలు తీసుకుంటామని నీటి పారుదలశాఖ ఏఈ విశ్వం హెచ్చరించారు. పలుచోట్ల నిర్మాణదారులు విధులకు ఆటంకం కలిగించారన్నారు. సెక్షన్ సిబ్బంది కబీరుల్లాఖాన్ సిబ్బంది పాల్గొన్నారు.


ప్రహరీని కూల్చివేయిస్తున్న సిబ్బంది

'మనూ'లో ప్రవేశ ఆధారిత కోర్సులు దరఖాస్తుల గడువు పెంపు

రాయదుర్గం: మనూలో ప్రవేశ ఆధారిత కోర్సుల దరఖాస్తు గడువు తేదీని పెంచినట్లు 'మనూ' అడ్మిషన్స్ డైరెక్టరేట్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎం వనజ సోమవారం తెలిపారు. యూనివర్సిటీలోని పీహెచ్‌డీ, పోస్ట్ గ్రాడ్యుయేట్, బీటెక్, బీఈడీ, బీఏలకు ప్రవేశ ఆధారిత ప్రవేశాల కోసం ఆన్‌లైన్ దరఖాస్తును సమర్పించడానికి గడువును పెంచినట్లు ఆమె పేర్కొన్నారు. ఎల్‌ఎల్‌బీ(ఆనర్స్), ఎల్‌ఎల్‌బీ, పీజీ డిప్లొమో/డిప్లొమో, సర్టిఫికెట్ రెగ్యులర్ కోర్సులు 2024-25 విద్యాసంవత్సరానికి మే 30 వ తేదీ వరకు అవకాశం కల్పించడం జరిగిందన్నారు. దేశ వ్యాప్తంగా వచ్చిన వినతులను దృష్టిలో పెట్టుకొని ఈ అవకాశం కల్పించామన్నారు. అయితే ప్రవేశ పరీక్షలు షెడ్యూల్ 2024 జూన్11, 12,13 తేదీలలో జరుగుతాయన్నారు. ఈ ప్రాస్పెక్టస్, ఆన్‌లైన్ దరఖాస్తు ఫారాలు సమర్పించడానికి చివరి తేదీ వరకు విశ్వవిద్యాలయం వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటాయన్నారు. మరిన్ని వివరాల కోసం అడ్మిషన్ హెల్ప్ డెస్క్‌ను సంప్రదించాలన్నారు. ఫోన్ నంబర్లు 6207728673, 9866802414, 6302738370, 7500496666, 8374346948లలో సంప్రదించాలని ఆమె కోరారు.

నాంచారమ్మ జాతరను పెద్ద ఎత్తున నిర్వహిస్తాం


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి

గోల్కొండ: ఈ నెల 23న ప్రారంభం కానున్న నాంచారమ్మ మహా జాతరను పెద్ద ఎత్తున నిర్వహిస్తామని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. రాష్ట్ర ఎరుకల సంఘం నాయకులతో కలిసి జాతర పోస్టర్‌ను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన నియోజకవర్గంలో జరిగే జాతరకు ఇబ్బందుల్లేకుండా ఏర్పాట్లు చేయాలని ఇప్పటికే స్థానిక, జిల్లా అధికారులతో మాట్లాడనన్నారు. ఎరుకల సంక్షేమం కోసం బడ్జెట్‌లో ప్రత్యేకంగా నిధులు కేటాయించాలని సీఎంను కోరుతానన్నారు. అంతేకాకుండా మరిన్ని గురుకులాలు ఏర్పాటు చేయాలని సంబంధిత మంత్రికి విన్నవిస్తానన్నారు. కార్యక్రమంలో ఎరుకల సంఘం నాయకులు కురాకుల కృష్ణ, మల్లేశ్, రఘు, వెంకటేశ్ తదితరులు ఉన్నారు.

గోపన్‌పల్లిలో డ్రైనేజీ సమస్య పరిష్కారం

రాయదుర్గం: గోపన్‌పల్లిలో డ్రైనేజీ సమస్యతో ప్రజలు సతమతమవుతున్నారు. దీనికితోడు ఇటీవల కురిసిన వర్షాలకు కొన్నిచోట్ల రోడ్లపై వర్షంనీరు నిలిచిపోయింది. దీనికితోడు గోపన్‌పల్లి ప్రధాన రోడ్డుపై మ్యాన్‌హోల్ పొంగి మురుగు రోడ్డుపైకి వస్తోంది. 4 రోజులుగా ఈ సమస్య నెలకొందంటూ గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి దృష్టికి తీసుకొచ్చారు.దీంతో ఆయన సోమవారం గోపన్‌పల్లిలో డ్రైనేజీ సమస్యను పరిశీలించి అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో జీహెచ్ఎంసీ సిబ్బంది డ్రైనేజీ సమస్యను పరిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు రంగస్వామి, మధు, స్థానికులు పాల్గొన్నారు.